హైదరాబాద్ వార్త

వనజాతరకు వెళదాం.. తల్లులకు ప్రణమిల్లుదాం

*** 4వేల బస్సులతో ఆర్టీసీ సిద్ధం * మేడారంపై ఉచిత బస్సు ప్రయాణ ప్రభావం * వారాంతం ప్లాన్ చేసుకొంటున్న నగరవాసులు**

జూబ్లీహిల్స్, జనవరి 18, ప్రభాతవార్త : అది ఆసియాలోనే అతి పెద్ద వనజాతర.. రెండేళ్లకొకసారి వచ్చే తల్లుల మహా పండుగ.. నాలుగు రోజులపాటు సాగే ఈ పండుగకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు,గిరిజనులు పెద్దసంఖ్యలో తరలి వస్తారు. తల్లుల కోటలో బసచేయడమే కాకుండా 'బంగారం'(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అలాంటి పండుగకు నగరం నుంచి ప్రతి ఏడు లక్షల సంఖ్యలో భక్తులు తరలివెళ్తుంటారు. ఈసారి జనవరి 28 నుంచి 31 వరకు మేడారం మహాజాతరకు ఇప్పటికే ప్రభుత్వం అన్నిఏర్పాట్లు చేస్తుంది. తొలిసారిగా మంత్రివర్గ సమావేశాన్నీ మేడారంలో సిఎం నిర్వహిస్తున్నారు. అలాంటి వేడుకకు నగరం నుంచి ఎలా వెళ్లాలి, ఎక్కడ బసచేయాలి, ఏఏ ప్రాంతాలను చూసి రావాలనే అంశాలపై ఇలా ప్లాన్ చేసుకుందాం.

నగరం నుంచి తల్లుల చెంతకు...

హైదరాబాద్ నుంచి మేడారం దూరం 280 కిలోమీటర్లు. హైదరాబాద్-వరంగల్-ములుగు-తాడ్వాయి-మేడారంలకు చేరుకోవచ్చు. సాధారణ రోజుల్లో ఈ ప్రయాణానికి 6 నుంచి 7 గంటలు పడుతుంటే, జాతర రోజుల్లో ట్రాఫిక్ ఒత్తిడి కారణంగా 8-10 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే ముందస్తు ప్రణాళికతో ప్రయాణించాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

వారాంతం ఇలా ప్లాన్ చేసుకుందాం..

భారీ రద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తులు జనవరి 31(శనివారం ఉదయం)న హైదరాబాద్ నుంచి బయలుదేరితే 70 కిలోమీటర్లు దాటిన తరువాత అల్పాహారం సేవించడానికి అనుకూలమైన హోటళ్లు అందుబాటులో ఉన్నాయి. నేరుగా వరంగల్‌కు చేరుకొని అక్కడి నుంచి ములుగు, తాడ్వాయిల మీదుగా మేడారం చేరుకోవచ్చు. వరంగల్ నుంచి మేడారానికి దాదాపు 98 కిలోమీటర్లు ఉంటుంది. సాధారణంగా వెళ్తే రెండు గంటల సమయం పడుతుంది. పండుగ సమయంలో మూడు నుంచి అయిదు గంటల సమయం పట్టే అవకాశం ఉంటుంది. ముందు రోజు(30న శుక్రవారం) రాత్రి వరంగల్‌లో బస చేసి 31న మేడారం బయలుదేరవచ్చు. తద్వారా రద్దీని కొంతమేర తప్పించుకునే అవకాశం ఉంది.

ఇవి చూసుకుని వెళ్లండి...

సొంత వాహనాల్లో ప్రయాణించేవారు తప్పని సరిగా వాహన సర్వీస్ చేయించుకోవాలి. అవసరమైన ఆహారం వెంట తీసుకెళ్లాలి. చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మందులు, ప్రాథమిక వైద్య సామగ్రి వెంట ఉంచుకోవాలి. అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి. అధికారిక పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలపాలి. ఇందుకోసం ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది.

ఆర్టీసీ ఇలా...

మహాజాతర నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసింది. ప్రధానంగా రవాణా శాఖ 4 వేల ప్రత్యేక బస్సులను ఉప్పల్ క్రాస్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి కొనసాగి స్తుంది. 500 బస్సులను మహిళల ఉచిత ప్రయాణం నేపథ్యంలో పెంచింది.

జనవరి 25 నుంచి ఫిబ్ర వరి 1 వరకు ఆర్టీసీ బస్సులు కొనసాగుతాయి. 42,810 ట్రిప్పులు ప్లాన్ చేసుకున్నట్లు ఇప్పటికే ఆర్టీసీ అధికారులు తెలిపారు. బస్సులో వెళ్లడం వల్ల మేడారం గ్రామంలోని బస్టాండ్‌ను చేరుకుం టారు. అక్కడి నుంచి నేరుగా తల్లులు కొలువుదీ రిన గద్దెలవద్దకు చేరుకోవచ్చు. పోలీస్, అగ్నిమాపక, వైద్యశాఖలు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఇవీ చూసొద్దాం...

నగరం నుంచి మేడారం వెళ్లి తిరిగి వచ్చే సమయంలో పలు పర్యాటక ప్రాంతాలను చుట్టి రావొచ్చు. మేడారం నుంచి నేరుగా లక్నవరం వెళ్లి అక్కడ బోటింగ్‌తోపాటు తీగల వంతెన పరిశీలించవచ్చు. అనంతరం అక్కడి నుంచి రామప్పకు వెళ్లి యునెస్కో గుర్తింపు పొందిన ఆలయాన్ని చూడొచ్చు. రామప్ప ఆలయం సమీపంలో హరిత గెస్ట్‌హౌజ్ అందుబాటులో ఉంది. అక్కడి నుంచి నగరానికి చేరుకొని ఆదివారం తూర్పు, పడమరకోట,భద్రకాళి ఆలయం, వేయి స్థంబాల దేవాలయం చూసి ఆదివారం రాత్రికి నగరానికి తిరిగిరావొవచ్చు.

తల్లులు వస్తారిలా...

జనవరి 28: కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు గద్దెకు చేరుకుంటారు.

జనవరి 29: చిలకలగట్టు నుంచి కుంకుమ భరిణి రూపంలో ఉన్న సమ్మక్క తల్లి గద్దెకు చేరకుంటారు.

జనవరి 30: భక్తులు తల్లులను దర్శించుకోవచ్చు. బంగారం(బెల్లం) సమర్పించుకోవచ్చు.

జనవరి 31: అమ్మవార్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

కుప్పలు తెప్పలుగా అనుమతి లేని ప్రైవేట్ ఆస్పత్రులు

ఫీజుల రూపంలో అధిక వసూళ్లు... ఫిర్యాదులు అందుతున్నా చర్యలు తీసుకోని అధికారులు

హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త : వైద్యఆరోగ్యశాఖ విభాగం మొక్కుబడి తనిఖీల వల్ల ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అధికారులు అంతంత మాత్రంగా చేపట్టే తనిఖీలలో అనేక ఆస్పత్రులు అక్రమంగా పుట్టుకొస్తున్నట్లు వెలుగులోకి వస్తున్నాయి. ఇక పూర్తిస్థాయి తనిఖీలు జరిపితే ఎంత దారుణమైన విషయాలు వెలుగులోకి వస్తాయని తెలుస్తోంది. ఆస్పత్రులను ఏర్పాటుచేయడానికి అనేక నిబంధనలు ఉన్నా వాటిని పాటించకుండా ఇష్టారాజ్యంగా పుట్టుకొస్తూనే ఉన్నాయి. చిన్నపాటి జబ్బులకు ఆస్పత్రులకు వచ్చేవారికి చుక్కలు చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తేలికపాటి రోగాలకు కూడా ఆస్పత్రి వర్గాలు అనేకరకాల టెస్ట్‌ల పేరిట ఆస్తులు అమ్ముకునే పరిస్థితి తీసుకువస్తున్నారని రోగులు చెబుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆస్పత్రులను నియంత్రించకపోవడంతో వీధి వీధిలో తెప్పలు తెప్పలుగా ఆస్పత్రులు వెలుస్తున్నాయి. ఇష్టానుసారంగా ఫీజులు వసూల్ చేస్తూ రోగుల రక్తం వీలుస్తున్నారని చెబుతున్నారు.

శివారు ప్రాంతాలలో కుప్పలు తెప్పలుగా...

నగర శివార్లలో ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. అధికారుల నియంత్రణ లేని కారణంగా అర్హత లేకున్నా క్లినిక్‌లను ఏర్పాటు చేసుకుని ప్రజల ప్రాణాల మీదికి తెస్తున్నారు. కొంతమంది వైద్యులు కేవలం ఒక ఆస్పత్రికి అనుమతి తీసుకుని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళల్లో కొనసాగించడానికి మూడు, నాలుగు అస్పత్రులను ఏర్పాటు చేసుకుంటున్నారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అధికారుల అలసత్వం పెరిగిపోవడంవల్ల పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆస్పత్రులకు పగ్గాలు వేయడం సాధ్యమవడంలేదు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు అనవసర పరీక్షలు చేయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు, డయాగ్నొ స్టిక్ సెంటర్లపై వైద్యారోగ్య శాఖ మొక్కుబడి తనిఖీలతో కాలం వెళ్లబుచ్చుతోందన్న విమర్శలు ఉన్నాయి. రోగుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, అల్ట్రాసౌండ్ సెంటర్లపై వైద్య, ఆరోగ్య శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా వైద్యారోగ్య శాఖ పట్టించుకోని వైనంపై రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మల్కాజ్‌గిరి జిల్లాలోనే అనేక ఆస్పత్రులు అక్రమంగా నెలకొల్పారని అనేక ఫిర్యాదు అందాయి. ఈఏడు కేవలం పది రోజుల్లోనే జిల్లాలో దాదాపు 45 పాలీక్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, హెల్త్‌కేర్ సెంటర్‌లు, ఫస్ట్‌ఎయిడ్ క్లినిక్‌లు ల్యాబ్‌లు,అల్ట్రాసౌండ్ కేంద్రాలను తనిఖీ జరిపి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా అర్హతలేని వైద్యులు, సిబ్బంది వాటిని నడుపుతున్నట్లు గుర్తించి సీజ్ కూడా చేశారు. కేవలం పదిరోజుల తనిఖీలో ఉన్న అక్రమ సెంటర్‌లను సీజ్‌చేయగలిగితే నిరంతరం తనిఖీలు జరిపితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. నిబంధనల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో బోర్డులు ఏర్పాటుచేయాలని, ఈ బోర్డుల మీద ఫీజుల ధరల పట్టికసహా డాక్టర్లు, సిబ్బంది, పడకల సంఖ్య వంటి సమాచారాన్ని పొందుపర్చాలని పేర్కొంటున్నప్పటికీ ఎక్కడా అవి మచ్చుకు కనిపించడంలేదు. అధికారిక లెక్కల ప్రకారం ఒక్క మల్కాజ్‌గిరి జిల్లాలోనే అనుమతి ఉన్న అస్పత్రులు 2850 ఆస్పత్రులు ఉండగా అనధికారికంగా దాదాపు 1000 ఆస్పత్రులు కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఆస్పత్రులకు అనుబంధంగా దాదాపు 5వందలకు పైగా ఎలాంటి అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. పాలీ క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, హెల్త్‌కేర్ సెంటర్‌లు, ఫస్ట్‌ఎయిడ్ క్లీనిక్‌లు ల్యాబ్‌లు, అల్ట్రా సౌండ్ కేంద్రాలపై, అలాగే అధిక ఫీజులు వసూల్ చేస్తున్న ఆస్పత్రులపై ఫిర్యాదులు అందుతున్నప్పటికి వైద్యశాఖ అధికారులు మాత్రం నామమాత్రంగానే చర్యలు తీసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. అనుమతి లేకుండా విచ్చలవిడిగా వెలుస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు క్లినిక్‌ల వల్ల ప్రజలు అనేక రకాలుగా నష్టపోతున్నా అధికారులు తనిఖీలు నామమాత్రంగా జరుపుతున్నారని, ఫిర్యాదులు అందితేనే చర్యలు తీసుకుంటామని చెబుతున్నట్లు విమర్శిస్తున్నారు. కొంతమంది ఆర్ఎంపీ డాక్టర్‌లుగా బోర్డులు పెట్టుకొని చిన్నపాటి ఆస్పత్రినే నడుపుతున్నారు. కొన్ని బెడ్‌లను ఏర్పాటు చేసుకొని సెలైన్‌లు, బ్లెడ్ ఇతర అత్యవసర పరిస్థితిలో వాడాల్సిన డ్రగ్స్‌ను అక్రమంగా రోగులకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా తనిఖీలు అంతంత మాత్రంగానే కొనసాగడంవల్ల ప్రజల ప్రాణాల మీడికి వస్తోంది.

ఆగి ఉన్న కారును ఢీకొట్టి బోల్తాపడిన కారు

హైదరాబాద్,జనవరి 18 ప్రభాతవార్త : నేరేడ్‌మెట్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. దీన్‌దయాళ్‌నగర్‌లో అతివేగంతో వచ్చిన ఓ కారు ఇంటి ముందు నిలిపి ఉంచిన మరో కారును ఢీకొట్టి బోల్లాపడింది. భారీ శబ్దం రావడంతో ఆందోళనకు గురైన స్థానికులు ఇళ్లలోంచి బయటకు వచ్చి చూశారు. కారు నడిపిన మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడం తో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద దృశ్యాలు అక్కడి సీసీటీవీలో రికార్డయ్యాయి.

ఉపాధ్యాయురాలు అదృశ్యం

నరూర్‌నగర్, జనవరి 18 ప్రభాతవార్త: అనారోగ్య సమస్యలతో మానసికంగా బాధపడుతున్న ఓ ప్రభుత్వ పాఠశాల టీచర్ అదృశ్య మైంది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బడంగ్‌పేట్ సీతా మిడోస్ కాలనీలో నివసించే అరుణ (58) స్థానిక బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. అయితే కొన్ని సంవత్సరాలుగా ఆమె అనారోగ్య సమస్యల కారణంగా మానసికంగా బాధపడుతున్నది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్ళిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పాఠశాలతో పాటు పలు ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటయ్యే వరకు ఉద్యమిస్తాం : ఎమ్మెల్యే తలసాని

మాట్లాడతున్న ఎమ్మెల్యే తలసాని

అడ్డగుట్ట, జనవరి 18 ప్రభాతవార్త : సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాను ఏర్పాటు చేసేవరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.ఆదివారం మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ఏర్పాట చేసిన సమావేశంలో తలసాని మాట్లాడుతూ 220 సంవత్సరాల చరిత్ర కలిగిన అస్థిత్వం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేం దుకు ప్రభుత్వం కుట్రచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 17న తలపెట్టిన శాంతి ర్యాలీ కోసం దరఖాస్తు చేసుకోగా అనుమతి ఇస్తున్నామని బుకాయించి అధికారులు ఉద్దేశపూర్వకంగా అర్ధరాత్రి అనుమతి లేదని సమా చారం పంపండం సరైంది కాదన్నారు. ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసు లను మోహరించి తమ కార్యకర్తలను ఎక్కడికక్కడా అరెస్ట్‌లు, నిర్బం దాలు చేసి అడ్డుకునే ప్రయత్నం చేసి భయంకర వాతావరణం కల్పించారన్నారు. వచ్చే నెల మొదటి వారంలో కోర్టు అనుమతి తీసుకొని భారీ ర్యాలీ నిర్వ హిస్తామని చెప్పారు. అదేవిధంగా సికింద్రాబాద్ బంద్‌కు పిలుపునిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, కార్పొరేటర్లు లింగాని ప్రసన్న, మహేశ్వరీ, శైలజా, రాసూరి సునీత, కంటోన్మెంట్ తెలంగాణ ఉద్యమ నేత గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ బోర్డు మెంబర్లు పాండుయాదవ్, నళిని కిరణ్, అనితా ప్రభాకర్, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, బిఆర్ఎస్‌నేతలు ఆకుల హరిక్రిష్ణ, నాగులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసే ఆశావహులు

20లోగా ఎంఐఎంకు దరఖాస్తులు చేయాలి

చార్మినార్, జనవరి 18 ప్రభాతవార్త : రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేయదలచిన ఆశావహులు తమ దరఖాస్తులను జనవరి నెల 20వ తేదీలోగా సమర్పించాలని ఏఐఎంఐఎం సూచించింది. ఆశావాహులు తమ దరఖాస్తులను ఏఐఎంఐఎం అధికారిక ఫేస్‌బుక్ పేజీ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పార్టీ జిల్లా ఇన్‌చార్జికి దరఖాస్తులను అంద జేయాలని ఎంఐఎం పిఆర్ఓ తౌఫీక్ తెలిపారు.పార్టీ అధ్యక్షులు అసదుద్దీన్ ఒవైసీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాలను స్వయంగా ప్రకటిస్తారని ఆయన తెలియజేశారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ 125 స్థానాలలో విజయం సాధించింది. కాగా త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం అన్ని స్థానాలలో పోటీ చేయాలని నిర్ణయించింది.

హాట్ ఎయిర్‌బెలూన్స్ తికలిస్తున్న ప్రజలు

కళాకారిణి అనన్యను ఘనంగా సత్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రవీంద్రభారతి, జనవరి 18 ప్రభాతవార్త : భారతీయులమైన మనమంతా సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సమర్పణలో ప్రదర్శింపబడిన గీతాసారం పారాయణ నృత్యాభినయంకు ప్రతిష్టాత్మక జాతీయ వేదిక రవీంద్రభారతి ప్రధాన మందిరం వేదికైంది. శ్రీమద్భగవద్గీతలోని 700 శ్లోకాల నుండి విశేషమైన 54 శ్లోకాలను ఎంపికచేసి గీతాసారమనే అతిపురాతన ధర్మగ్రథాన్ని శాస్త్రీయ కూచిపూడి నృత్యాన్ని తదనుగుణంగా మేళవించి సుప్రసిద్ధ కళాకారిణి వెంట్రప్రగడ నూతన అనన్య అద్భుతమైన ఏకపాత్రాభినయంతో ఆయా శ్లోకాలను ప్రత్యక్షంగా పఠిస్తూ వాటిలోని సంపూర్ణ అర్థాన్ని తన అభినయం నృత్యం ద్వారా భగవద్గీత సారాంశాన్ని కళ్లకుకట్టినట్లు కూచిపూడి నృత్యశైలిలో ప్రదర్శించి సభికులను తన్మయుల్ని చేశారు. ప్రఖ్యాత నాట్యగురు డా. మద్దాళి ఉషా గాయత్రి, నట్టువాంగం సుశీలశర్మ సమకూర్చగా వెంపటి శ్రీవల్లిశర్మ దివ్యమైన రాగాలతో గాత్రం అందించగా, వయోలిన్ కోలంక అనిల్, మృదంగం శ్రీధరాచార్య, వేణువు వెంకటేష్‌ల అద్భుత వాద్యసహకారం ప్రదర్శనను మరింత రక్తికట్టించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విశిష్ట అతిథులు డా. కె.అరవిందరావు, డా. అనంతలక్ష్మి, మద్దాళి రఘురామ్, భరణి, నాట్యగురు డా. ఉషాగాయత్రి, నర్తకి భవానిలతో కలిసి కళాకారిణి అనన్యను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. అనన్య విద్యతోపాటు సంగీతం, గానం, నాట్యం ఒకేసారి నేర్చుకోవడం కష్టసాధ్యమేనని ఆమెను అభినందిస్తూ ఇవి నేర్చుకుంటే పిల్లలు క్రమశిక్షణతోపాటు తల్లిదండ్రులు, సనాతనధర్మం, సంస్కృతి, భారతీయ జీవనవిధానం, పెద్దలన్నా గౌరవం అలవడుతాయని, ఈ వర్తమాన కాలంలో ఎంతో ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. అనన్య నేడు 54 శ్లోకాలను పారాయణం చేస్తూ తాత్పర్యాన్ని నృత్యాభినయంతో వివరించడం వినూత్న ప్రయోగమని, అయితే మొత్తం 700 శ్లోకాలకు పారాయణ నృత్యాభినయం మున్ముందు దేశవ్యాప్తంగా కావించాలని, ఇందుకు తల్లిదండ్రులు, గురువు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు.

బ్యాంకులో ఫైర్ అధికారి, సిబ్బంది

హయత్‌నగర్ ఎస్‌బిఐలో అగ్ని ప్రమాదం

హయత్‌నగర్, జనవరి 18 ప్రభాతవార్త: షార్ట్‌సర్క్యూట్‌తో హయత్‌నగర్‌లోని ఎస్‌బిఐలో అగ్ని ప్రమాదం జరిగింది. వివరాలు... కుంట్లూరు రోడ్డులోని ఎస్‌బిఐలో ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేయడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ఎసిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంబవించినట్లు వారు తెలిపారు.

కుటుంబ కలహాలతో నేపాల్ వ్యక్తి ఆత్మహత్య

చార్మినార్, జనవరి 18 ప్రభాతవార్త : కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది నేపాల్‌కు చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాలాఫత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. నేపాల్‌కు చెందిన రాజేందర్ సింగ్ రిషి(26) బతుకు దెరువు కోసం పాతబస్తీ వచ్చి దానిమ్మ గుడిసెల ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మొదటి భార్య చనిపోవటంతో రాజేందర్‌సింగ్ రిషి రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు కుమార్తె, రెండవ భార్యకు కొడుకు ఉన్నారు. కాగా కుటుంబ కలహాలు కారణంగా రెండవ భార్య ప్రస్తుతం నేపాల్‌లో ఉంటుంది. భార్యా భర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. పాతబస్తీ అన్సారీ రోడ్డు ప్రాంతంలో ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో రాజేందర్‌సింగ్ రిషి పని చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన రాజేందర్ సింగ్ రిషి శనివారం రాత్రి మీరాలం వాటర్ ఫిల్టర్ ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్మకు పాల్పడ్డాడు.ఆదివారం ఉదయం వాటర్ వర్క్స్ సిబ్బంది చెట్టుకు ఉరేసుకుని ఉన్న రాజేందర్ సింగ్ రిషిని చూశారు. ఈ విషయాన్ని వారు కాలాఫత్తర్ పోలీసులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రాజేందర్ సింగ్ రిషి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.ఈ కేసును కాలాఫత్తర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువత ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్య భారత్ నిర్మాణం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గచ్చిబౌలి, జనవరి 18 ప్రభాతవార్త

శక్తివంతమైన యువత భారత్ సొంతమని, యువత ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యభారత్ నిర్మాణం జరుగుతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం ఫిట్ ఇండియాలో భాగంగా గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో ఆదివారం 'సండేస్ ఆన్ సైకిల్' 57వ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సైకిల్ రైడ్‌ను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం కిషన్‌రెడ్డి స్వయంగా సైకిల్ రైడ్‌లో పాల్గొని సైకిల్ తొక్కారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఫిట్ ఇండియా లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నేడు ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పులు, శారీరక శ్రమ లేకపోవడంతో రకరకాల అనారోగ్యాలకు,ఒబెసిటీకి గురవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా నేటి యువత ఎక్కువగా ఓబెసిటీ బారిన పడుతున్నారని, ఓబెసిటీని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేకకార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు.మానసిక ఒత్తిడి సైతం అనేక ఆరోగ్య సమస్యలకు కారణంగా మారుతుందని తెలిపారు. తన చిన్నతనంలో ఎవరి పనులు వారే చేసుకునేవారని, కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. మారిన కాలానికి, పెరిగిన టెక్నాలజీతో పనిభారం తగ్గిందని, దీని కారణంగా త్వరగా అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఫిట్ ఇండియా కార్యక్రమం ద్వారా ఆరోగ్య భారత్ కోసం ప్రధాని మోడీ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. యువత ఆరోగ్యవంతంగా ఉంటేనే దేశానికి సేవ చేసే అవకాశం లభిస్తుందని, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన యువత, మేధస్సే దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సైకిల్ రైడ్ సందర్భంగా ప్రదర్శించిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో సైబరాబాద్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్, పలువురు క్రీడా ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

సైకిల్ రైడ్‌లో పాల్గొని సైకిల్ తొక్కుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

అమరజ్యోతి ర్యాలీ ప్రారంభం

రసూల్‌పురా జంక్షన్‌లో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించిన రామకృష్ణ, సుహాసిని, తెలుగు తమ్ముళ్లు

బేగంపేట జనవరి 18,ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి,నటుడు నందమూరి ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా బేగంపేట రసూల్‌పురా జంక్షన్‌లోని ఆయన విగ్రహం వద్ద నందమూరి రామకృష్ణ, సుహాసిని, శ్రీపతి సతీష్‌కుమార్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ, సుహాసినిలు అమర జ్యోతి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ రసూల్‌పురా ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ప్రారంభమై ఎన్‌టిఆర్ ఘాట్ వరకు సాగింది. ర్యాలీలో పెద్ద ఎత్తున తెలుగుదేశం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ, సుహాసిని మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి శ్రీపతి రాజేశ్వరరావు అఖిల భారత ఎన్‌టిఆర్ అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉండేవారిని, ఆయనకు అప్పట

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలాడి రామారావు తదితరులు

డిమాండ్ల సాధనకు 'హాలో ఒసి-చలో ఢిల్లీ'

సైఫాబాద్, జనవరి 18 ప్రభాతవార్త: పేద అగ్రవర్ణాల డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 27న 'హాలో ఒసి-చలో ఢిల్లీ' పేరిట ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీగా ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఓసి జెఎసి జాతీయ, రాష్ట్ర కమిటీ నాయకులు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన ఓసి నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓసి సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు,ఉపాధ్యక్షుడు చందుపట్ల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గట్టు మహేష్‌బాబు తదితరలు ఈ చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు పటిష్టంగా అమలు చేయాలని, ఓసిల స్థితి గతుల అధ్యాయనానికి ప్రత్యేక ఓసి జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఈ డబ్ల్యూఎస్ కోటాకు కేటాయించి మిగిలిన బ్యాక్‌లాగ్ పోస్టులను ఈడబ్ల్యూఎస్ వారితోనే భర్తీ చేయాలని, ఈడబ్ల్యూఎస్ అర్హతకు వార్షిక ఆదాయాన్ని 10 లక్షలకు పెంచాలని, అలాగే రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు చకిలం రమణయ్య, రాజీరెడ్డి, దివాకర్‌రావు, కొండ నర్సిహులు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను జీర్ణించుకోలేకపోతున్న మాల నేతలు

మేడి పాపయ్యమాదిగ

ఐక్యత చాటుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

సైఫాబాద్, జనవరి 18 ప్రభాతవార్త: కొంత మంది స్వార్థపర మాల నాయకులు ఎస్సీ వర్గీకరణను జీర్ణించుకోలేక ఎబిసీ వర్గీకరణను రద్దు చేయాలని కుట్ర పన్నుతున్నారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ ఆరోపించారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదని మూడు దశాబ్దలుగా పోరాడి సాధించుకున్నామని చెప్పారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన మాదిగ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు ఈనెల 21వ తేదీ నిర్వహించదలచిన సన్మాన సభను ఫిబ్రవరి మాసానికి వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈనెల 21న ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని, సమావేశంలో పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలను రూపొందించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఎస్సీలను ఆర్థికంగా అదుకునేందుకు కార్పోరేషన్‌కు నిధులు కేటాయించాలని, అంబేద్కర్ అభయ హస్తం పథకానికి నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ ఉపాధ్యక్షుడు మంద జయన్న, నాయకులు దాస్‌మోహన్, విజయ్‌కుమార్, యాదగిరి, చింతా నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

మహానుభావుడు లూయీ బ్రెయిలీ : ఎమ్మెల్యే

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

జీడిమెట్ల, జనవరి 18, ప్రభాతవార్త : చూపు లేని జీవితాలలో అక్షరాల వెలుగు నింపిన మహానుభావుడు లూయీబ్రెయిలీ అని బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం సూరారం కాలనీ లూయీ బ్రెయిలీ భవనంలో లూయీబ్రెయిలీ 217వ జయంతివేడుకల్లో వివేకానంద్ జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో కలిసి నూతన సంవత్సర లూయీ బ్రేల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి, కేక్ కటాచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చూపులేని జీవితాలకు అక్షరాల వెలుగు నింపిన మహానుభావుడు లూయి బ్రెయిలీ అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ద బ్లైండ్ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ విసి.వీర రాఘవన్, వెల్ఫేర్ అసోసియేషన్ డిసేబుల్డ్ ప్రెసిడెంట్ జి.అంజయ్య, సారా ప్రవీణ్‌కుమార్‌గౌడ్, లూయిస్ బ్రెయిలీ సూరారం అసోసియేషన్ సభ్యులు సత్యం, ఎస్.రాజ్ కుమార్, నరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ పాల్గొన్నారు.

పద్మశాలీలకు అండగా ఉంటా : కాలేరు

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త: వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పద్మశాలీలకు అవకాశం కల్పిస్తానని అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ ఇచ్చారు. ఆసక్తి ఉన్న వారు ముందుకు వస్తే సీట్లు కేటాయిస్తానని చెప్పారు. ఈ మేరకు శ్రీ భక్త మార్కెండేయ ప్రచార పద్మశాలి సేవా సమాజం అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షుడు కైరం గట్టయ్య ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఎస్వీఆర్ ఫక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలీలకు అండగా ఉంటానని, పద్మశాలి భవన నిర్మాణానికి తన వంతు సహాయం అందిస్తానని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహావిష్కరణకు కూడా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, నియోజకవర్గం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, కిష్టయ్య రాజేశ్వర్, అందే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం హిమాయత్‌నగర్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్న సంఘం నాయకులు

రాంకీ ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దుండిగల్, జనవరి 18, ప్రభాతవార్త

బిజెపి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నాయకులతో కలిసి రాంకీ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ పరిధి గ్రామాలు బౌరంపేట్, దుండిగల్, నాగులూరు, డి పోచంపల్లి, బహదూర్ పల్లి, మల్లంపేట్ గ్రామాల్లోని కంజర్వేషన్ జోన్ ఎత్తివేయడంలో ప్రత్యేక చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం 7257 చ.కిమీ. విస్తీర్ణంతో 2013 లో మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం హందాపరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లోని 70 మండలాలు, 24 మునిసిపాలిటీలు, 8 మునిసిపల్ కార్పొరేషన్లు, 750 గ్రామాలు ఉన్నాయి. అయితే ఇటీవల 20 మునిసిపాలిటీలు, 7 మునిసిపల్ కార్పొరేషన్లను జిహెచ్ఎంసిలో విలీనం చేయడం జరిగిందని, మాస్టర్‌ప్లాన్ వల్ల ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి ఏమోగానీ రైతుల పాలిట మాత్రం శాపంగా మారిందన్నారు.పేద, అమాయక, సన్న, చిన్నకారు రైతుల భూములు ఇండ్ల నిర్మాణానికి కూడా అవకాశం లేని కన్సర్వేషన్ లాంటి జోన్లలో ఉన్నాయని, ఈ కారణంగా దాదాపు 50 వేల మంది రైతులు తమ భూములలో సొంత ఇల్లు కూడా నిర్మించుకునే పరిస్థితి లేదన్నారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే మార్చి రైతులకు అనుకూలమైన రీతిలో రూపొందించవలసి ఉందన్నారు. రైతులు తరపున దుండిగల్ మున్సిపల్ బీజేపీ ఆధ్వర్యంలో కంజర్వేషన్ జోన్ నుండి మల్టిపర్పస్ జోన్ మార్చిడికి కృషి చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విగ్నేశ్వర్, నాయకులు గోనె మల్లారెడ్డి, ఎంబరి ఆంజనేయులు ముదిరాజ్, దమ్మగారి ప్రభాకర్‌రెడ్డి, డి.సీతారాంరెడ్డి, తురాయి భానుగౌడ్, నర్సింగ్‌రావ్, ఆర్ నర్సింహాచారి, శ్రీనివాస్‌యాదవ్, ఎం.అతీష్‌బాబు, వెంకటేష్‌నాయక్, శివనాయక్, విజయ్‌నాయక్, రోహిత్‌నాయక్, శ్రీనునాయక్, శంకర్‌నాయక్, క్యాసారం రాజు, సుడే బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కంజర్వేషన్ జోన్ ఎత్తి వేయడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

నీటి సమస్య పరిష్కరించాలి

నార్సింగి, జనవరి 18 ప్రభాతవార్త : హైదర్షాకోట్ డివిజన్ పరిధిలోని కపిల్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కపిల్‌నగర్ కాలనీ వాసుల నీటి ఇబ్బందిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తోపాటు సంబంధిత జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వీలైనంత త్వరగా మంచినీటి ఇబ్బందులను దూరం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం పని చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశించారని, ఆయన చూపిన దారిలోనే వెళ్లి ప్రజలకు సేవ చేస్తున్నానని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. బండ్లగూడ కార్పోరేషన్ ఉన్న సమయంలో వేంగా ప్రజల ఇబ్బందులు దూరం చేయడం జరిగిందని, ఇప్పుడు గ్రేటర్‌లో కలిపిన తరువాత కొంత ఆలస్యం అవుతుందని తెలిపారు. పిలిస్తే పలికే ప్రజానేత ఎమ్మెల్యేగా ఉండడం మావంటి నేతలకు, ప్రజలకు కొండంత బలాన్ని ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే చొరవతోనే ప్రజల ఇబ్బందులను దూరం చేయడం జరుగుతుందని వివరించారు.

అలరించిన త్రినాథరావు గానాలాపన

గానం చేస్తున్న త్రినాథరావు

చిక్కడపల్లి జనవరి 18(ప్రభాతవార్త) : అంతర్జాతీయ గాయకుడు, స్వర కిన్నెర డాక్టర్ చింతలపూడి త్రినాథరావు నిర్వహించిన గానాలాపన ఆదివారం అందరిని అలరించింది. ప్రముఖ సాంస్కృతిక సంస్థ "ఈస్ట్ బే కరవోకే" నిర్వహించిన సినీ సంగీత విభావరిలో, సంస్థ ఆహ్వానంపై, 'శారదా వరపుత్ర' 'గాన కంఠీరవ' డా. త్రినాథరావు తన గానంతో ప్రవాస భారతీయ శ్రోతలను మైమరపింపజేశారు. త్రినాథరావు "మేరే సప్నోంకి రాణి" అంటూ హుషారుగా పాడుతుంటే, ప్రేక్షకులు ఉత్సాహంతో నిలబడి, హర్షధ్వానాలతో ఆనందాన్ని వ్యక్తపరిచారు. త్రినాథరావు మాట్లాడుతూ, తను అమెరికా వచ్చిన ప్రతీసారి, బాటా సంస్థ నిర్వాహకులు మంగిన ప్రసాద్ వారి కార్యక్రమాలకు ఆహ్వానిస్తూ ఉంటారని, వారి సంగీత కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు సంతోషాన్నిస్తుందని, తెలియజేశారు. ప్రసాద్ సభాముఖంగా, త్రినాథరావు కి అభినందనలు తెలియజేస్తూ, అమెరికా వచ్చినప్పుడల్లా, కాలిఫోర్నియాలో జరిగే సంగీత కార్యక్రమాలన్నిటిలోను పాల్గొంటారనే ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

25 నుంచి ఉచిత ప్లాస్టిక్ సర్జరీ

హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త : పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్,సేవాభారతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఉచితంగా ప్లాస్టిక్ ఆపరేషన్లు చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు విద్యాభూషణ్, రఘునాథ్రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణంమొర్రి, అవాంఛిత రోమాలు వంటివాటికి అమెరికా వైద్యులు ఉచిత ప్లాస్టిక్ సర్జరీచేస్తారని తెలిపారు. ఆసక్తిఉన్నవారు ఈనెల 23వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్నవారికి 23, 24వ తేదీల్లో స్క్రీనింగ్ పరీక్షలు మల్లేపల్లి సీతారాంబాగ్‌లో ఉన్న లయన్స్ క్లబ్ ఆస్పత్రిలో నిర్వహిస్తారని తెలిపారు. విదేశీ వైద్యులు భవానీ ప్రసాద్, మేర్సీ మిషన్ అధ్యక్షులు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షణలో సర్జరీలు ఉంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9848241640/ 98493069385 ఫోన్‌ద్వారా సంప్రదించాలని సూచించారు.

పాతబస్తీలో ఎన్టీఆర్ వర్ధంతి

చాంద్రాయణగుట్ట, జనవరి 18, ప్రభాతవార్త : టిడిపి వ్యవస్థాపకులు, సమైక్యాంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 30వ వర్ధంతిని ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. చాంద్రాయణగుట్ట, రక్షాపురం కాలనీ, లాల్‌దర్వాజా మోడ్, గౌలిపురా తదితర ప్రాంతాలలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో దేశం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న బిఆర్ఎస్ నేతలు

జిల్లా ఏర్పాటుకు తలసాని చేస్తున్న కృషి అభినందనీయం

బిఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు యాద శ్రీనివాస్‌గుప్తా

హైదరాబాద్, జనవరి, 18, ప్రభాతవార్త: సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేస్తున్న కృషి అభినందనీయమని బిఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు యాద శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలసి ఆయన శాలువాతో సత్కరించి, పూలబొకేతో అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ సికింద్రాబాద్ బచావో అనే ఒక నినాదంతో శ్రీనివాసయాదవ్ ఇచ్చిన పిలుపు మేరకు వచ్చే నెల మొదటి వారంలో పెద్దఎత్తున నిరసన తెలుపుతామని, కోర్టు నుంచి ఈ విధంగా అనుమతి తీసుకుని వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినందుకు హృదయపూర్వక ధన్యవాదములు తెలియచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కోడూరు శ్రీధర్, సాగర్, కే.సి.శేఖర్‌రెడ్డి, నరహరిచారి, సురేందర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ పేరిట జిల్లా ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న ఓరుగంటి వెంకటేశంగౌడ్

సైఫాబాద్, జనవరి 18 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం సికింద్రాబాద్ పేరిట జిల్లాను ఏర్పాటుచేసి, మున్సిపల్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి వెంకటేశంగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎవరిన సంప్రదించకుండా సిఎం రేవంత్‌రెడ్డి జిహెచ్ఎంసిలో 300 డివిజన్లు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. సికింద్రాబాద్‌ను మల్కాజ్‌గిరి కార్పోరేషన్‌లో ఎందుకు విలీనం చేయాలని, సికింద్రాబాద్ పేరును రూపుమాపడానికే ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన విధంగా రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, హైదరాబాద్ నగరాన్ని విస్తీర్ణం చేసి చివరికి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చే ఆలోచనలో ఉన్నారని ఆయన విమర్శించారు. తక్షణమే రేవంత్‌రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలక్కపోతే ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విరాళం అందజేత

నిజాంపేట్, జనవరి 18, ప్రభాతవార్త : అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి పౌరుని బాధ్యత అని పగతినగర్ కాలనీ సభ్యుడు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శికిలమెట్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి, ప్రగతినగర్ డివిజన్‌లో ప్రతిష్ఠించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శికిల మెట్ల వెంకటేశ్వర్లు రూ.10,111 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి అమోఘమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్య ప్రాముఖ్యతపై అంబేద్కర్ ఇచ్చిన సందేశాలు నేటి తరానికి ఎంతో ప్రేరణనిస్తాయని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుతోయువతలో చైతన్యం పెరుగుతుందన్నారు.ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ధనరాజ్, కే.రాములు, వి .వి.రావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళులు

నిజాంపేట్, జనవరి 18, ప్రభాతవార్త : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతినగర్ కమన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానాయకుడని కొనియా డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

కెపిహెచ్‌బి కాలనీలో ఎన్టీఆర్ వర్ధంతి

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 18, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకొని కెపిహెచ్‌బికాలనీ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జేఎన్‌టియు సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రమ్యా గ్రౌండ్ వసంత్ నగర్ సెంటర్ వద్ద ఆ మహనీయుడి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం పండ్లు, పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యురాలు ఉప్పల పద్మాచౌదరి, నాయకులు షేక్‌సత్తార్, అట్లూరి దీపక్, వేములపల్లి రాజా, శివ సత్యనారాయణ, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, కొల్లూరి శ్రీనివాస్,కాకర్ల గోపికృష్ణ, జాస్తి రమాదేవి, చిరుమామిళ్ళ ఉమా, సుబ్బారావు, మదన్మోహన్ దొప్పలపూడి, కిషోర్ కేతినేని, కెవిఆర్ చౌదరి, చెరుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పి రోడ్డులో...

కూకట్‌పల్లి, జనవరి 18, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపెట్ డివిజన్‌లోని హెచ్‌పి రోడ్డులో ఉప్పు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నటరత్న డాక్టర్ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూము సాగర్‌పటేల్, రమేష్‌గౌడ్, కొత్తపల్లి రామ్‌గౌడ్, జానకమ్మ శ్రీనివాస్ గౌడ్, గణపతి అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వసంత నగర్‌లో...

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 18, ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి, నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) 30వ వర్ధంతిని పురస్కరించుకుని వసంతనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ బండి రమేష్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కులమతాలకు అతీతంగా ప్రజలందరి హృదయాల్లో నిలిచిపోయిన మహానాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో యువ నాయకుడు గాదె శివ, నాయకులు జివిఆర్, గోపిశెట్టి రఘు, కెపిహెచ్బి డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ డివిజన్ అధ్యక్షురాలు రజితరామారావుచౌదరి, కిలారి బాబు, కొల్లి సత్యనారాయణ, చావా శ్రీనివాసరావు, ఏకనారాయణ, పొడుగు అప్పారావు, మూసాపేట్ డివిజన్ ప్రెసిడెంట్, రాజు, జనార్దన్, నాని, కమ్మ సంఘ నాయకులు తదితరులు పాల్గొని ఎన్టీఆర్‌కి ఘన నివాళులు అర్పించారు.

ఫిల్మ్‌నగర్‌లో ఎన్టీఆర్ వర్ధంతి

జూబ్లీహిల్స్, జనవరి 18, ప్రభాతవార్త: టీటీడీపీ ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ నేతల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమాన్ని ఫిల్మ్‌నగర్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ డివిజన్ నాయకులు నర్సింహులు, రాష్ట్ర బీసీ సెల్‌నేత బాలాజీ గోసామి, గోవింద్, యాదగిరి, నాగరాజు, సాయికుమార్, రాములు, వెంకటేష్, నరేష్, అరవింద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగు జాతి బ్రతికున్నంత కాలం ఆయన ప్రతి ఒక్కరి గుండెలో ఉంటారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాలలో చిరస్థాయి ఎన్టీఆర్

సైఫాబాద్, జనవరి 18 ప్రభాతవార్త: తెలుగు వారి కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేసిన సర్గీయ నందమూరి తారక రామారావు చిరస్థాయిగా ప్రజల హృదయాలలో నిలిచిపోతారని సమైకాంధ్ర పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు గోట్టి కుమార్‌చౌదరియాదవ్ చెప్పారు. నటుడిగా ఎన్నో సినిమాలలో ఆనేక పాత్రలను పోషించారని, రాజకీయ నాయకుడిగా పేద, బడుగు బలహీనవర్గాలకు విశేషమైన సేవలు అందించారని ఆయన కొనియాడారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఎన్టీఆర్ ఘాట్‌లోని సమాధిపై పుష్పాగుచ్చాలు ఉంచి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయ నాయకులు ప్రజలకు సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో రుద్రహోమం

బేగంపేట జనవరి 18,ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా రుద్ర హోమం నిర్వహించారు. హోమంలో 150 మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. హోమం, పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసారు. ఈ సందర్భంగా ఆలయంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.

నేటి నుంచి ఉద్భవ జాతీయ నృత్యోత్సవం

**రవీంద్రభారతి, జనవరి 18

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసిలో విలీనం చేయాలి ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, జనవరి 18 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న కంటోన్మెంట్ బోర్డుకు 2020 నుంచి ఎన్నికలు నిర్వహించకుండా ప్రజా స్వామ్యాన్ని ఖూనిచేస్తూ ప్రజల హక్కులను కాలరాస్తూ నామినేటెడ్ సభ్యులతో కాలయాపన చేస్తుందని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆరోపించారు. ఆదివారం పికెట్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుల పదవీ కాలన్నీ పొడిగిస్తున్నట్లు జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గం అభివృద్ధిని కుంటుపరుస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టారు. కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసీలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20 నుంచి కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్,సీనియర్ కాంగ్రెస్ నేతలు పెద్దల నర్సింహ్మ, ఆర్.డి.నాగేశ్ యాదవ్,దుడ్డు సత్య నారాయణ, మారుతీ గౌడ్,వినోద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు నిర్వహించాలి : మన్నె క్రిషాంక్

కంటోన్మెంట్, జనవరి 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, మినరల్ డెవలప్‌మెంట్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ పదవిని మరో ఏడాది పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆదివారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఎదుట నామినేటెడ్ కుర్చీతోపాటు జీవోకాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు 11 సంవత్సరాల నుంచి నిర్వహించకుండా ఇటు జిహెచ్ఎంసిలో విలీనం చేయకుండా నామినేటెడ్ మెంబర్‌తో పాలన కొనసాగించడం ఎంతవరకు సమంజసమన్నారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ బోర్డు మెంబర్లు కోర్టుకు వెళ్లి ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసినా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. కంటోన్మెంట్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కానీ పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నేతలు ఏ.ఎల్. ఆనంద్,మోనీ, యాసిన్,గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

మహానేత ఎన్టీఆర్

ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

అడ్డగుట్ట, జనవరి 18 ప్రభాతవార్త: టీడిపి వ్యవస్తాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తోనే తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని టీడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, పార్లమెంట్ ఇన్‌ఛార్జి అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత అన్నారు. టీడిపి రాష్ట్ర కార్యదర్శి జనగామ నర్సింగ్‌రావ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావ్, నాయకులు డిఆర్.శ్రీనివాస్, అనురాధ, ఎస్.కె.బాబు, అశోక్‌యాదవ్, నాగరాజుగౌడ్, మేలక చంద్ర శేఖర్, రవిందర్ పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు.

నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నాం : చార్మినార్ ఎడిఇ

లబ్దిదారులకు శుభాకాంక్షల లేఖలను అందజేస్తున్న చార్మినార్ ఏడిఈ

చార్మినార్, జనవరి 18ప్రభాతవార్త: పాతబస్తీలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని టిజిఎస్‌పిటిసిఎల్ చార్మినార్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు సయ్యద్ మక్సూద్ అహ్మద్ అన్నారు. చార్మినార్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరింగ్ పరిధిలోని హుస్సేనీఆలం, మొగల్‌పుర, చార్మినార్ విద్యుత్ సెక్షన్‌లకు చెందిన గృహజ్యోతి లబ్దిదారులకు ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పంపిన శుభాకాంక్షల లేఖలను లబ్దిదారులకు అందజేశారు. చార్మినార్,హుస్సేనీఆలం,మొగల్‌పుర విద్యుత్ సెక్షన్ల పరిధులలో దాదాపు ఐదు వేల గృహజ్యోతి లబ్దిదారులు ఉన్నారని, ఐదు వేల మంది గృహజ్యోతి లబ్దిదారులకు ప్రభుత్వం రూ. 17 లక్షల సబ్సిడిని అందజేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్సేనీ ఆలం విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు రాములు,సిబ్బంది పాల్గొన్నారు.

జూ పార్కును సందర్శించిన కేంద్ర అటవీశాఖ డైరెక్టర్ జనరల్ బృందం

చార్మినార్, జనవరి 18 ప్రభాతవార్త : కేంద్ర అటవీశాఖ డైరెక్టర్ జనరల్ సుశీల్ కుమార్ అవస్థి బృందం హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కును సందర్శించింది.నెహ్రూ జూలాజికల్ పార్కులోని పలు ఎన్‌క్లోజర్‌లలో ఉన్న జంతువులు,పక్షులను అధికారులు చూశారు. ఈ సందర్భంగా కేంద్ర అటవీ శాఖ డైరెక్టర్ జనరల్ సుశీల్ కుమార్ అవస్థి మాట్లాడుతూ జూ పార్కులోని మూషిక జింకల సంతానోత్పత్తి కేంద్రం నిర్వాహణ బాగుందని తెలిపారు.జూ పార్కులోని జంతువులు ఎంతో ఆరోగ్యంగా ఉన్నాయని, జూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచటం పట్ల ఆయన ప్రసంశించారు.ఈ కార్యక్రమంలో ఈ తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ ముఖ్య సంరక్షణ అధికారి డాక్టర్.సి.సువర్ణ, అదనపు పీసీసీఎఫ్ రత్నాకర్ జౌరీ,ఎఫ్‌డిసీ విసీ సునీతా భగవత్,జూ పార్కు డైరెక్టర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరేమత్,జూపార్కు క్యూరేటర్ జె.వసంతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సోదర ప్రేమను, ఐక్యతను పెంపొందించేందుకే లవ్‌ఫెస్ట్: పటోళ్ల సబితారెడ్డి

ఎల్.బి.నగర్, జనవరి 18 ప్రభాతవార్త: క్రైస్తవ సంఘంలో సోదర ప్రేమ, ఐక్యతను పెంపొందించేందుకే ఏర్పాటు చేసే కార్యక్రమమే లవ్‌ఫెస్ట్ అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ డివిజన్‌లోని పాస్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో బాప్టిస్ట్ చర్చ్‌లో ఆదివారం జరిగిన క్రైస్తవులు లవ్‌ఫీస్ట్ వేడుకలకు ముఖ్యఅతిథిగా సబితాఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ కలిసి భోజనం చేస్తూ ఫెలోషిప్ పంచుకుంటారని, ఇది ఒక మతపరమైన సామాజిక సమావేశం అన్నారు. క్రైస్తవ మతంలో ముఖ్యంగా సంఘ సబ్యుల మధ్య ప్రేమను, ఐక్యతను పెంపొందించడానికి ఈ భోజనం ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా తను చిన్నతనంలో మిషనరీ స్కూల్లో చదివానని అప్పటి అనుభూతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవిందశర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కంచర్ల శేఖర్, రామ్‌నర్సింహగౌడ్, సాజిద్, వెంకటేష్‌గౌడ్ సంతోష్, శంకర్,యాదమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగర పర్యాటకాభివృద్ధికి 'హైదరాబాద్ టూరిజం వీకెండ్ గేట్‌వేస్'

టూరిజం రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ బూట్‌క్యాంప్

బూట్‌క్యాంప్‌లో పాల్గొన్న డాక్టర్ మణిపవిత్ర, రామచంద్రమ్ తదితరులు

జూబ్లీహిల్స్, జనవరి 18, ప్రభాతవార్త

నగరంలో మొదటిసారిగా నిర్వహించిన టూరిజం రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ మేకింగ్ బూట్ క్యాంప్ శనివారం జూబ్లీహిల్స్‌లోని క్రియేటర్‌వర్స్‌లో నిర్వ హించారు. వివిధ రంగాలకు చెందిన 58 మంది పాల్గొన్నారు.బూట్‌క్యాంప్‌ను ఫెడరేషన్ ఆఫ్ తెలం గాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టి సీసీఐ) టూరిజం కమిటీ ఆధ్వర్యంలో క్రియేటర్‌వర్స్-ఇండియాస్ ఫస్ట్‌కంటెంట్ ఫ్యాక్టరీ సహకారంతో నిర్వహించారు. టూరిజం రీల్స్‌ను ఆకర్షణీయంగా, ప్రభావవంతంగా, వైరల్ అయ్యేలా రూపొందించే నైపుణ్యాలను ఈ శిక్షణలో నేర్పించారు. ఈ ఇన్‌హౌస్ బూట్‌క్యాంప్ సాధారణ ప్రజలను శక్తివంతమైన డిజిటల్ స్టోరీటెల్లర్స్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించారు. ఇందులో భాగంగా జనవరి 24న మూడు పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లి అవుట్‌డోర్ హ్యాండ్స్ ఆన్ సెషన్ నిర్వహించనున్నారు. క్రియేటర్‌వర్స్ వ్యవస్థాపకుడు డా. మణి పవిత్ర డిజిటల్ వైరాలిటీపై మాట్లాడుతూ రీల్ తయారీ ఒక శాస్త్రమని, మొదటి మూడు సెకన్లే అన్నింటినీ నిర్ణయిస్తాయన్నారు. ఆ సమయంలో వీక్షకుడిని ఆకట్టుకో లేకపోతే రీల్ దాటవేయడం అవుతుందని, ఈ విషయాన్ని అల్గారిథమ్ గమనిస్తుందన్నారు. స్కిప్ రేటు తక్కువగా ఉంటే ఇన్‌స్టాగ్రామ్ ఆ రీల్‌ను నాన్‌ఫాలోవర్లకు పంపుతుందన్నారు. వైరల్ రీల్స్ అదృష్టంకాదని, వ్యూహం, మానసిక శాస్త్రం, టైమింగ్ కలయిక అనిఅన్నారు. రీల్స్ బాగున్నందుకే వైరల్ కావని, స్కిప్‌చేయకపోతేనే వైరల్ అవుతాయన్నారు. వైరాలిటీ అల్గారిథమ్ ట్రిక్ కాదని, భావోద్వేగ అను సంధానమని, అనేక హృదయాల్లో పునరావృతమయ్యే ప్రక్రియ అని అన్నారు. గత ఏడాది కాలంలో క్రియే టర్ వర్స్ బూట్‌క్యాంప్‌ల ద్వారా 50,000కుపైగా రీల్స్ రూపొందించామన్నారు. 550 మందికిపైగా ప్రొఫెషనల్స్, వ్యాపారవేత్తలు, డాక్టర్లు తమ సొంత కంటెంట్‌ను రూపొందించారన్నారు. తెలంగాణలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలతోపాటు, తెలియని పర్యా టక ప్రదేశాలను రీల్స్ ద్వారా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, హైదరాబాద్ టూరి జం వీకెండ్ గెటవేస్" రీల్ కాంటెస్ట్‌నేపథ్యంలో ఈ బూట్‌క్యాంప్ నిర్వహించబడిందన్నారు. డిజిటల్ ప్రపంచంలో పర్యాటక ప్రాంతాలకు గుర్తింపు కల్పించడం ద్వారా తెలంగాణ టూరిజాన్ని ప్రోత్సహించ డమే తమ ఉద్దేశమన్నారు. రీల్స్ ఇప్పుడు ప్రయాణ నిర్ణయాలను ప్రభావితం చేసి, వాస్తవ ఆర్థిక ప్రయోజనాలను తీసుకువస్తున్నాయి అని టూరిజం కమిటీ సహ చైర్మన్ డి.రాంచంద్రమ్ తెలిపారు. భవిష్యత్ డిజిటల్ కమ్యూనికేషనేకే ఉందన్నారు. ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా 40 వేల కోట్లకుపైగా రీల్స్ వీక్షిస్తున్నారని, మన మెదడు టెక్స్ట్ కంటే వీడియోను 60వేల రెట్లు వేగంగా ప్రాసెస్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టిసీసీఐ టూరిజం కమిటీ చైర్మన్ ప్రకాశ్ అమ్మనబోలు,డైరెక్టర్ సంగీత మాట్లాడుతూ, ఈ బూట్‌క్యాంప్ ద్వారా ప్రయాణికులు, టూరిజం రంగంలోని వర్గాలకు ప్రాక్టికల్ రీల్ మేకింగ్ నైపుణ్యాలు అందించి, హైదరాబాద్ చుట్టుపక్కల వీకెండ్ టూరిజం గమ్యస్థానాల ప్రచారానికి నాణ్యమైన కంటెంట్ సృష్టించడమే లక్ష్యమన్నారు.

నవ్వులు పూయించిన హాస్యాల వారి విందు

చిక్కడపల్లి జనవరి 18 (ప్రభాతవార్త) : హైదరాబాద్ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ హాస్యాల వారి విందు పేరుతో నిర్వహించిన నవ్వుల నజరానా అందరిని నవ్వులలో తేలియాడించింది. ఎల్ ఎస్ ఆర్ మూర్తి , మోహన కృష్ణ , శరత్ చంద్ర ఈ వేడుకను నిర్వహించారు.గత 5 సంవత్సరాలుగా క్లబ్ ద్వారా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.సినీ దర్శకుడు జంధ్యాల జయంతి సందర్భంగా ఈ వేడుకను నిర్వహించారు.ముఖ్య అతిథిగా దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పాలకుర్తి మధు సూదన రావు, యువకళా వాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అతిథులుగా హాజరయ్యారు. ఎంవీ సుబ్రమణ్యం (ఫ్రెండ్స్ కామెడీ క్లబ్), మోహన కృష్ణ, శారదా, జ్యోతి, నండూరి సుందరి నాగమణి అన్నపూర్ణ ఏ ఎస్ఆర్ మూర్తి కుటుంబరావు ఆర్ వీ రమణ కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు. ఆంధ్ర బ్యాంకు ఉద్యోగులు, అశోక్ నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. లక్ష్మీ, వైష్ణవి, ప్రజ్ఞ సంప్రదాయ నాట్యం చేశారు.ఎల్ ఎస్ ఆర్‌కే మూర్తి కుటుంబరావు ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు.అనంతరం నటులకు జ్ఞాపికలను అందచేశాసారు.

తెలంగాణ లెక్చరర్స్ ఫోరం బలోపేతానికి కార్యాచరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కత్తి వెంకటస్వామి తదితరులు

చిక్కడపల్లి, జనవరి 18 (ప్రభాతవార్త): తెలంగాణ లెక్చరర్స్ ఫోరంను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడంతోపాటు,సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు ఫోరం రాష్ట్రచైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ శ్రీపతి శేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫోరం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫోరం రూపొందించిన నూతన సంవత్సర డైరీ,క్యాలెండర్‌ను ఫోరం రాష్ట్రకార్యదర్శి పి.అరుణ్ రూపొందించిన కవితా సంపుటి శూన్యం వ్యాసాల సంపుటి, బిగ్ బ్యాంగ్ పుస్తకాలను కత్తి వెంకట స్వామి, శ్రీపతిశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తి వెంకటస్వామి, శ్రీపతి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఫోరం నిరంతరం కృషిచేస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లాలోనూ కమిటీలను పటిష్టం చేసి, క్షేత్రస్థాయిలో అధ్యాపకులను ఏకం చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి డి. వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు (జి ఎ టి ఎస్) తిరుపతి (యు టి ఓ), కోశాధికారి ఏ రవి, కురుమూర్తి, మార్కండేయ, మహేష్, అంజి, సదానందం, ఫరీద్ , నవీన్, ఫోరం ప్రతినిధులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన అధ్యాపకులు మరియు విద్యారంగ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త: ఉప్పల్ మినీశిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మహబూబాబాద్‌కు చెందిన తాండవ కృష్ణ నృత్యాలయ కూచిపూడి నాట్య గురువులు ఉదయశ్రీ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా తాండవ నృత్యకారి, జయము జయము, బ్రహ్మాంజలి, ముద్దుగారే యశోద, మూషిక వాహన, దేవీస్తుతి, కృష్ణ శబ్దం, స్వాగతం కృష్ణ, భో శంభో, నమశ్శివాయతే,అయిగిరినందిని, దశావతరాలు అంశాలను ప్రదర్శించి మెప్పించారు. కళాకారులు సుకృత, ఆకాంక్ష, సన్నిధి, సాన్విక,శ్రీ సాయిపల్లవి, సహర్షితా, చైత్రిక, రేణుశ్రీ, నేహ శ్రీ, లక్ష్మి, ఉపాసన, అధ్య, తపస్వి, దీపశిక, రిషిక, కృషిక, అక్షర ప్రదర్శించి మెప్పించారు.

గానసభలో రాగ, తాళ, నాట్యశ్రీ అవార్డులను ప్రదానం చేసిన దృశ్యం

పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్నిస్థాయి

విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ శంకర్ రామిశెట్టి

చిక్కడపల్లి, జనవరి 18 (ప్రభాతవార్త):పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ శంకర్ రామిశెట్టి అన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఆదివారం రాగ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ రాగరంజని ఆధ్వర్యంలో రాగ తాల్, నాట్యశ్రీ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా శంకర్ రామిశెట్టి హాజరై పురస్కారాలను ప్రధానం చేసి ప్రసంగించారు. ఎఫ్ టి విసీసీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ నృత్య, కళారంగాలలో ఉన్న వారిని ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహంగా ముందుకు సాగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాట్య గురువులు జయశ్రీ, రాజశ్రీ, వ్యాఖ్యాత బుర్ర మోహన్ కృష్ణ, గాయకుడు బాపిరాజు, తబలా మాస్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గొనె సల్మాన్‌రాజ్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

సిఎంఎం రేవంత్‌రెడ్డికి పాస్టర్ల వినతి

చిక్కడపల్లి, జనవరి 18 (ప్రభాతవార్త) : తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వంలో ఏదైనా నామినేటెడ్ పదవి ఇవ్వాలని ముషీరాబాద్ నియోజకవరం ప్రొటెస్టెంట్ చర్చి పాస్టర్లు, మతపెద్దలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసారు. ఆదివారం ఆర్టీసీక్రాస్‌లోని వెస్లీ చర్చిలో మెన్నోనైట్ చర్చి, వెస్లీసి ఎస్‌టి చర్చి, బాప్టిస్ట్ చర్చి, ఎక్కలేసియా చర్చి, హెబ్రోన్ చర్చి, ఇండిపెండెంట్ చేర్చేస్, క్రిస్టియన్ ఎల్డెర్స్‌లకు చెందిన పాస్టర్లు జయప్రకాశ్ , డేవిడ్ రాజ్, బి.ప్రేమ్ సాగర్, ఎం.ఏ.వందం, థామ్సన్, తిమోతి తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రముఖ ప్రొటెస్టెంట్ నాయకుడిగా ఎన్నో సంవత్సరాలుగా క్రైస్తవ సమాజ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న గొనె సల్మాన్‌రాజ్ క్రైస్తవ సమాజ స్థలాల సమస్యలు, చర్చుట భద్రతకు సంబంధించిన అంశాలు, పాస్టర్లు, విశ్వాసులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంలో ఆయన ముందుండి పనిచేస్తునానరని అన్నారు. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి గొనె సాల్మన్‌రాజ్‌ని ప్రభుత్వం ఏదైనా నామినేటెడ్ చైర్మన్ పదవికి నియమించవలసిందిగా కోరారు. సమావేశంలో క్రిస్టియన్ సమాజం ప్రతినిధులు బి.మల్లేష్, టి.ప్రవీణ్, బి.జె.దీనదయాళ్, డాక్టర్ మొగిలి స్టీఫెన్, సుకుమార్, జాయ్ సన్, విజయ్ కుమార్, రెవరెండ్ కె..అనిల్ కుమార్, అజరయ్య మోసెస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ కాల భైరవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త :

మౌని అమావాస్య సందర్భంగా ఉప్పల్ భగాయత్‌లోని స్వయంభు శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అమావాస్య సందర్భంగా శ్రీ కాల భైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి పూజలు చేస్తారని పేర్కొన్నారు. మౌని అమావాస్య హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన దినంగా భావించబడుతుందని, దైవధ్యానం చేయడం వల్ల ఆత్మశుద్ధి కలిగి సకల దోషాలు నివృత్తి అవుతాయని భక్తుల విశ్వాసం అన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్‌నగర్ నుండి ఖమ్మం బయలుదేరి వెళుతున్న సిపిఎం నేతలు

సిపిఐ వందేళ్ల సభకు తరలిన నేతలు

చాంద్రాయణగుట్ట, జనవరి 18, ప్రభాతవార్త : భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల వేడుకకు పాతబస్తీ ఉప్పుగూడ హనుమాన్‌నగర్ నుండి ఆపార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ సరిగ్గా వందేళ్ళ క్రితం కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. నిరుపేదల పక్షాన నిలిచి నిటారుగా పోరాడే పార్టీ సీపీఐ అన్నారు. వందేళ్ళ ఉత్సవాల స్ఫూర్తితో భవిష్యత్‌లో తాడిత, పీడిత వర్గాలకు న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు అటుకుల రాజు, సునీల్, బాలయ్య, డాక్టర్ ఎస్.సూర్య ప్రకాష్, జి.వినీత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చాంద్రాయణగుట్ట, జనవరి 18, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్ట, పూల్‌బాగ్, బాలాపూర్ రోడ్డులోని డీఎల్ఆర్ఎల్ శ్రీ బాలాజీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 19వ తేదీ సోమవారం నుండి 24వ తేదీ శనివారం వరకు జరిగే శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆ ఆలయ వంశపారంపర్య అర్చకులు కాండూరు శేషాచార్యులు, కాండూరు సుధాకరాచార్యుల ఆధ్వర్యంలో జరిగే స్వామి బ్రహ్మోత్సవాలలో తొలిరోజైన సోమవారం ఉత్సవారంభం, గోష్ఠి, 20వ తేదీ మంగళవారం ధ్వజారోహణం, హోమం, దేవతాహ్వానం, పూర్ణాహుతి, 21వ తేదీ బుధవారం వేద పారాయణం, సంక్షేమ రామాయణ హోమం, సహస్రనామ పారాయణం, 22వ తేదీ గురువారం లక్ష్మీహోమం, బలిహరణ, విష్ణు సహస్రనామ పారాయణం, 23వ తేదీ శుక్రవారం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణం, విష్ణు సహస్రనామ పారాయణం, 24వ తేదీ శనివారం వేద పారాయణ, సుదర్శనారసింహ హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ద్వాదశారాధన, సప్తావరణం, ధ్వజావరోహణం, గోష్ఠి, రుత్విక్ సన్మానం, మహదాశీర్వచనం తదితర పూజాలతో ఉత్సవాలు సమాప్తమవుతాయని అర్చకస్వాములు వివరించారు. ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని స్వామివార్ల అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

పంచముఖ ఆంజనేయ శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని శ్రీశృంగేరి జగద్గురు మహా సంస్థానం, శ్రీపంచముఖ ఆంజనేయ శ్రీలక్ష్మివేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను 20 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు వైభవంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం ధర్మాధికారి కళావి ఎస్ జానార్దన మూర్తి, సీఈఓ పి ఏ.మురళి వివరించారు. 20, 21న ఉదయం 7 గంటలకు విష్ణుసహరనమ పారాయణం, స్వామివారికి అర్చన, బాలభోగం, నివేదన, మంగళ నీరాజనం, మంత్రపుష్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, స్వామిఫరిని పెండ్లి కుమారుణ్ణి, అమ్మవార్లను పెండ్లి కుమార్తెను చేయడం జరుగుతుందన్నారు. సాయంత్రం సంతానార్థులకు గరుడ ప్రసాదం పంపిణి చేస్తామన్నారు. కాగా 21న సాయంత్రం శ్రీవార్ల రాయబారా మహోత్సవమ్ ఉంటుందని, 22న శ్రీవార్ల శాంతి కళ్యాణం, అనంతరం శ్రీవార్ల గరుడోత్సవం ఉంటుందన్నారు. 23 న మహా సుదర్శన హోమం, సాయంత్రం శేషవాహన సేవ, 24న కొట్నాల వసంతోత్సవం, చక్రస్నానం, స

మోని అమావాస్య సందర్భంగా మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

అమ్మవారి చల్లని చూపులు ప్రజలు అందరిపై ఉండాలి

సర్పంచ్ బుజ్జం సంతోషా శ్రీశైలం యాదవ్..

కేశంపేట, జనవరి 18, ప్రభాతవార్త: ఆ అమ్మవారి చల్లని చూపులు ప్రజల అందరిపై ఉండాలని కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష శ్రీశైలం యాదవులు మాట్లాడుతూ గ్రామంలో పాడి పంటలు, పశుసంపద సమృద్ధిగా పండాలని అమ్మవారి చూపులు గ్రామ ప్రజలందరిపై ఉంటూ గ్రామస్తులు ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వార్డు సభ్యులు ,మంచే కృష్ణయ్య ,గంజాయి దశరథం, పులిమామిడి నగేష్ ,తిమ్మగల రామచంద్రి, బిజెపి యువ నాయకులు తలసాని పవన్ కుమార్ రెడ్డి ,పిల్లి అమరేష్ యాదవ్, కడియాల అంజయ్య ,శేఖర్ ,రాజు మహేష్ ,యాదయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాహన చలాన్ కోసం పర్సనల్ అకౌంట్ని అటాచ్ చేయడం సరికాదు

కరెడ్ల నరేందర్ రెడ్డి

కేశంపేట, జనవరి 18, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలపైనే అధిక భారం మోపుతోందని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా సాంస్కృతిక శాఖ నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రైవసీ అకౌంట్లను ఆర్డీఏకు అప్పజెప్పడం ఏ మాత్రం సరి కాదని అన్నారు. ముందు రైతు బంధు రైతుల అకౌంట్లోకి అనుసంధానం చేయాలని అన్నారు, రైతులను మభ్యపెట్టి రైతుబంధు ఇప్పటికీ ఇయ్యలేని చేతగాని ప్రభుత్వం నడుపుతున్నారని అన్నారు. ఇప్పుడు ప్రజల యొక్క ప్రైవసీని కాలరాశే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు , ప్రభుత్వానికి ప్రజలపై ఏమాత్రం ప్రేమ ఉంటే మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చి. ఆడపడుచులకు 2000 ఇస్తున్న హామీలు ఎక్కడ పోయాయి పెన్షన్స్ పెంచుతామన్నారు, ఇచ్చిన హామీలకు ప్రభుత్వ అకౌంట్ ని డైరెక్ట్ గా అటాచ్ చేసి పెన్షన్లను పెంచిచేతగాని వృద్ధులకు మహిళలకు, వితంతువులకు వికలాంగులకు నేరుగా అకౌంట్ లో డబ్బులు వేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇమ్మిడి మహేష్ కురుమకి ఘన సన్మానం

సర్పంచ్ ఉమ్మడి మహేష్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర కురుమ సంఘం నాయకులు

తలకొండపల్లి, జనవరి18,ప్రభాత వార్త: తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కురుమ సర్పంచ్‌లకు హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఎగ్గే మల్లేశం భవనంలో సన్మాన కార్యక్రమంలో వెంకట్రావుపేట గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఇమ్మిడి మహేష్ కురుమవెంకట్రావుపేట సర్పంచ్‌గా గెలుపొందరు. ఆదివారం నాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం , హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు ధత్తత్రేయ మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ గారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చెయ్యడం జరిగింది .ఈ కార్యక్రమంలో కురుమ సంగం రాష్ట్ర నాయకులు గొరిగే వెంకటయ్య ,మాజీ సర్పంచ్ కెంచ హైమావతి రమేష్ గారు, వార్డు మెంబర్ గౌర్ల లింగం ,గ్రామ పెద్దలు ఇమ్మిడి రాములు ,బోడ వెంకటయ్య ,గొరిగే తిరుపత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతికి ఆర్థికసాయం

మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి, జనవరి18,ప్రభాత వార్త: రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం, చీపునుంతల గ్రామంలో గుమ్మడి చెన్నమ్మ (80)గతకొంత కాలంగా అనారోగ్యంతోగురై ఆదివారం నాడు మృతిచెందారు. గత కొన్ని రోజులుగా.బాధపడుతూ ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచారు.. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ రూ.3వేలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు,ఈ మొత్తం రూ.6వేలు అందజేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు... ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్, సెల్ మండల అధ్యక్షులు మిడత చెన్నకేశవులు, మాజీ సర్పంచ్ బండి రఘుపతి,వార్డ్ సభ్యులు వంకురి శ్రీరాములు, గుమ్మడి చెన్నకేశవులు, నాయకులు వెంకటరాజు రెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లేష్, మిడత శేఖర్, దాసరి శేఖర్, శ్రీశైలం, చంద్రమోళి , చెన్నయ్య,శివ, వెంకటయ్య , శ్యామలాల్ , తదితరులు పాల్గొన్నారు..

తలకొండపల్లిలో బి అర్ ఎస్ అధిక స్థానాలలో గెలవటం పట్ల జీర్ణించుకోలేకనే ఆరోపణలు..

మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి. వెంకటేష్

తలకొండపల్లి, జనవరి18,ప్రభాత వార్త: తలకొండపల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో ఇటీవల సంభవించిన కొన్ని పరిణామాలు అలుసుగా తీసుకొని కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేశ్ ఆరోపించారు. రాంపూర్ గ్రామంలో ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అనుకొనంత ఏమి జరగలేదని. మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీకి అత్యధిక సీట్లు రావడానికి కారణమే ఈ ఆరోపణనని ఉప్పల వెంకటేశ్ అన్నారు. గ్రామాల్లో ఎన్నికల తర్వాత చిన్నచితిగా సంఘటన జరుగుతాయని దాని అలసిగా తీసుకొని ఎంపీ ఎమ్మెల్యే వచ్చి. ఐఏఎస్ ఐపీఎస్ లకు ఫోన్ చేసి బి ఆర్ ఎస్ కార్యకర్తలపై కేసులు బనాయించాలని ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. నిజానిజాలు గ్రామాలు తీసుకొని మాట్లాడండి ఆయన అన్నారు. టిఆర్ఎస్ నాయకులకు ఇక్కడ అన్యాయం జరిగిన వాళ్ళ వెన్నంటే ఉంటామని వెంకటేష్ అన్నారు.

ఇరుకు దారితో ఇబ్బందులేన్నో — ప్రజా ప్రతినిధులు పట్టించుకోండి

నందిగామ, జనవరి 18, ప్రభాతవార్త: నందిగామ పాత జాతీయ రహదారి నుండి అంతిరెడ్డి గూడ వెళ్లే ఇరుకు రహదారితో ఇబ్బందులు పడుతున్నామని ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోని రహదారి విస్తరణ పనులు చేపట్టాలని జంగోని గూడ బిఆర్ఎస్ సీనియర్ నేత జంగ రజనీకాంత్ ఆదివారం డిమాండ్ చేశారు. అస్తవ్యస్తమైన ఇరుకు రహదారిని బాగు చేయాలని చెప్పిన గత ప్రభ్నుత్వ. పాలకులు నిరక్ష్యంగా వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిపై ఒక వాహనం ఎదురుగా వస్తే మరో వాహనం పోలేని రీతిలో తయారయిందని, ఈసారైన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు రహదారి విస్తరణ పనులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

నందిగామ నుండి అంతిరెడ్డిగూడ వెళ్లే ఇరుకు రహదారి

ఘనంగా గోదాదేవి అభిషేకం..నోము

ఘట్‌కేసర్, జనవరి 18, ప్రభాతవార్త: ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నార్ రంగనాయకస్వామి దేవస్థానంలో గోదాదేవి అభిషేకం-నోము కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాలలో పాశురం పఠనం, నిత్యపూజలు, పుష్కరిణిలో తెప్పోత్సవం, శ్రీగోదారంగనాయకస్వామి కళ్యాణోత్సవం కనులపండువలా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని మండపంలో అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ఆలయ ధర్మకర్తలు అభిషేకం నిర్వహించారు. అనంతరం ధర్మకర్తలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య అమ్మవారి నోము కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ రకాల సుగంధద్రవ్యాలు, పంచామృతంతో అమ్మవారి మూర్తిని అభిషేకం చేశారు. ఈసందర్భంగా మహిళా భక్తులు పాల్గొని అండాల్ అమ్మవారి నోమును భక్తి, శ్రద్ధలతో తిలకించారు. అర్చకస్వాములు భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. ఆలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు ముగిసాయి. ధనుర్మాస ఉత్సవాలలో పూజాది కార్యక్రమాలు నిర్వహించిన ఋత్విక్కులకు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో ధర్మకర్తలు తిరువడందం పోరెత్తి శేషాచార్యులు, పార్థసారథిచార్యులు, పణికుమారాచార్యులు, పవనాచార్యులు పాల్గొన్నారు.

గోదాదేవి అభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్న ధర్మకర్తలు

నిరుపేదలకు అప్పన్నహస్తం సన్న బియ్యం పథకం

నందిగామ, జనవరి 18, ప్రభాతవార్త: మూడు రోజులపాటు జరిగిన సంక్రాంతి పండుగలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్న ఆశీస్సులతో సన్న బియ్యంతో మా కుటుంబ సభ్యులం,బంధు మిత్రులతో కలిసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా విందు చేసుకున్నామని..పల్లె జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో ప్రతి నిరుపేదకు సన్న బియ్యంతో పట్టెడన్నం దొరకడం అదృష్టంగా భావిస్తున్నామని పల్లె జనం మురిసిపోతున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే శంకరన్న పుణ్యమా అని మాకు కొత్త రేషన్ కార్డు వచ్చిందని, కార్డు ఇప్పిచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి, సహకరించిన సర్పంచ్ కొమ్ము కృష్ణ కు, అధికారులకు, నందిగామ కాంగ్రెస్ సీనియర్ నేత కేశమోని సాహితి రామచందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నందిగామలో రేషన్ బియ్యం తీసుకుంటున్న కాంగ్రెస్ నేత రాంచందర్

ఎదులాబాద్‌లో ఘనంగా 14వ విశ్వశాంతియాగం

విశ్వశాంతియాగంలో పాల్గొన్న కొండల్‌రెడ్డి దంపతులు, శంకరప్ప

అన్నప్రసాద వితరణ చేస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 18, ప్రభాతవార్త: జిహెచ్ఎంసి పరిధి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి దేవాలయంలో 14వ విశ్వశాంతియాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ యజ్ఞ నిర్వహణకర్త కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రతినెల మాసశివరాత్రి రోజును లోకకళ్యాణార్థం విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలోని విష్ణువినాయక కళ్యాణ మండపంలో శనివారం మాసశివరాత్రి సందర్భంగా స్వామికి అభిషేక పూజలు చేసి విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. మండల బిఆర్ఎస్‌పార్టీ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, అనిత దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. అర్చకులు శ్యామ్‌కుమార్, మహేశ్‌కుమార్‌ల మంత్రోచ్చారణాల మధ్య విశ్వశాంతిహోమం జరిపారు. విశ్వశాంతియాగం సందర్భంగా కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో త్వరలో 21 అడుగుల ఎత్తైన శ్రీవీరహనుమాన్ నల్లరాతి విగ్రహ ప్రతిష్టాపన చేయనున్నామని దాతలు సహకరించాలని ధర్మకర్త కంట్లం గౌరీశంకర్ కోరారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి ఎదుగని క్రిష్ణమూర్తి, మాజీ ఎంపిటిసిలు మంకం రవి, నాగులపల్లి రమేశ్, సొసైటీ మాజీ చైర్మన్ డొంకెన బిక్షపతిగౌడ్, ఆర్‌బిఎస్ మాజీ జిల్లా సభ్యులు చిలుగూరు మంకయ్య, మాజీ వార్డుసభ్యులు ఉదారి సత్యనారాయణ, ఎర్రోళ్ల మురళీకృష్ణ, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కానుగంటి శ్రీనివాస్, కుక్కునూరి రాజశేఖర్, చిరంజీవి, ధర్మకర్తలు ఓంప్రకాష్, నరేశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

జిల్లెడు చౌదరిగూడ,జనవరి 18,(ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో నిర్వహించిన ఆర్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొదటి స్థానంలో రావిర్యాల రెంజర్స్ జట్టు నిలవగా రెండవ స్థానంలో రావిర్యాల రౌడిబాయిస్ జట్టు నిలిచింది. విజేతలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, గ్రామ సర్పంచ్ నీలయ్య, ఉప సర్పంచ్ జంగయ్యలతో పాటు గ్రామ పెద్దలు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి రూ.20వేల రూపాయలను సర్పంచ్ నీలయ్య అందజేశారు. అలాగె రెండవ బహుమతి రూ.10వేలను ఉప సర్పంచ్ జంగయ్య అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిడాకారులు గెలుపు ఓటములను సమానంగ చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, బాల్‌రాజు, వీరన్న, గోపాల్‌రెడ్డి, భాస్కర్, వెంకటయ్య, చంద్రయ్య, మహెందర్, జగన్, శ్రీశైలం, నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

వడ్డే ఓబన్న జయంతి..నాయకుల నివాళులు

-సబండ వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి

ఘట్‌కేసర్, జనవరి 18 , ప్రభాతవార్త: మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా సమాజానికి సేవలందించాలని ఉమ్మడి ఘట్‌కేసర్ మండల వడ్డెర యువజన సంఘం అధ్యక్షులు మైగాని సాయికుమార్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 248వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సాయికుమార్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా నవంస్వయంకర్త ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాయికుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈసందర్భంగా బ్రిటిష్ వారిని వణికించిన గెరిల్లాయోధుడు వడ్డే ఓబన్న 219వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత రాజ్యాంగపీఠికపై అందరూ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, అంబేద్కర్ సంఘం (ఇడబ్ల్యుఎస్‌కాలనీ) అధ్యక్షులు బండారు రాందాస్, నాయకులు కె.నర్సింగ్‌రావు, కె.సత్యం, కడుపొల్ల బిక్షపతి, కె.మహిపాల్, జి.అంజయ్య, బి.గణేశ్‌గౌడ్, బి.సురేశ్‌గౌడ్, కృష్ణంరాజు, ఇ.విష్ణు, జె.అఖిల్, డి.శివకృష్ణ, లలిత్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళులు అర్పించి ప్రమాణం చేస్తున్న సాయికుమార్, అరుణ్‌కుమార్

క్రీడా మైదానంలో యూనిఫామ్‌తో ఉన్న క్రీడాకారులు

క్రీడాకారులకు డ్రెస్ స్పాన్సర్ చేసిన హర్ష విజయ నాయక్

అభినందనలు తెలిపిన క్రీడాకారులు

నందిగామ, జనవరి 18, ప్రభాతవార్త: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో ఉన్న శివకర్ క్రికెట్ మైదానంలో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు డ్రెస్ స్పాన్సర్ చేసిన తాటిగడ్డ తండాకు చేందిన హర్షవిజయ్ నాయక్‌కు క్రీడాకారులు అభినందనలు తెలిపారు. గ్రామీణ యువతను క్రీడలలో ప్రోత్సహిస్తున్న హర్ష విజయ్ నాయక్ సేవల పట్ల జటావత్ సోమ్లా నాయక్ (నాని) కృష్ణ (ఈట),పరుశురాం, రమేష్, గణేష్, ముఖేష్ లు అభినందించిన వారిలో ఉన్నారు.

రక్తదానంపై యాదిలాల్‌కు భువనేశ్వరి ప్రశంసలు

ఆమనగల్లు, జనవరి 18, ప్రభాతవార్త: కల్వకుర్తి నియోజకవర్గ టిడిపి ఇంఛార్జీ, ప్రముఖ న్యాయవాది యాదిలాల్‌పై ఎన్టీఆర్ ట్రస్టు అధినాయకురాలు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరిదేవి ప్రశంసల వర్షం కురిపించారు. గత కొన్ని సంవత్సరాలుగా యాదిలాల్ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆది వారం జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో స్థానిక టిడిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రక్తదానంలో పాల్గొని ఈఏడాది కూడా రక్తదానం చేశారు. యాదిలాల్ ఔన్న త్యాన్ని తెలుసుకున్న నారా భువనేశ్వరిదేవి యాదిలాల్‌ను ప్రత్యేకంగా అభినందించినట్లు స్థానిక టిడిపి నాయకులు తెలిపారు. సేవాగుణాన్ని అలవర్చుకోవడం మానవత్వ లక్షణాలకు నిదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు కండె సత్యం, అర్థం నర్సింహ్మ, గాజుల పద్మనాభం, శ్రీనాథ్, పంచాక్షరి, సింహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదిలాల్‌కు ప్రశంసపత్రం అందజేస్తున్న నారా భువనేశ్వరి

ఎన్టీఆర్ సేవలు అనుసరణీయం

ఆమనగల్లు, జనవరి 18, ప్రభాతవార్త: బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలు అన్ని తరాలకు అనుసరణీయమని టిడిపి సీనియర్ నాయకులు కండె భాస్కర్, చింతలపల్లి సర్పంచ్ కొప్పు యాదయ్యలు అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. ఆదివారం ఎన్టీఆర్ వర్ధంతి సంధర్భంగా ఆమనగల్లు టిడిపి శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటస్వామిగౌడ్, గుండమల్ల జగన్, జంగయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆమనగల్లులో ఎన్టీఆర్ చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న టిడిపి శ్రేణులు

మైసమ్మదేవతకు ఎమ్మెల్యే పూజలు

ఆమనగల్లు(కడ్తాల) జనవరి18, ప్రభాతవార్త: కడ్తాల మండలం మైసిగండి గ్రామంలోని మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి మైసమ్మదేవతను దర్శించుకున్నారు. ఆలయంలో ఎమ్మెల్యేకసిరెడ్డి మైసమ్మదేవతకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ఫౌండంట్రస్టీ మాజీ ఎంపిపి రామావత్ శిరోలీ మాజీ పిఎసిఎస్ చైర్మన్, టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదినం కావడంతో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి అమ్మవారిని దర్శించు కున్నారు. ఈమేరకు శిరోలి, శ్రీనివాస్ గౌడ్‌లు కసిరెడ్డిని శాలువాతో సన్మా నించి శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఠాకూర్‌బాలాజీసింగ్, గూడూరు భాస్కర్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, బిక్యనాయక్, బిచ్యనాయక్, జ్యోతినాయక్, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మైసిగండిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

గృహజ్యోతి లబ్దిదారులకు పత్రాలు అందజేస్తున్న సర్పంచ్

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ గడ్డం వెంకటయ్య

కుల్కచర్ల,జనవరి 18 ప్రభాతవార్తః గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకొవాలని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు. అదివారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామ పంచాయతీకార్యాయలంలో గృహజ్యోతి లబ్దిదారులకు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడతూ...గత బిఆర్ఎస్ ప్రభుత్వనికి ధనిక రాష్ట్రాన్ని అప్పులకుంపటిలోకి నెట్టారని, పది సంవత్సరాల పాలనలో ఒక్క రేషన్ కార్డు, ఇండ్లు లేని పేదలకు ఇల్లు ఇవ్వలేదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంత్సరాల పాలనో రైతులకు 2 లక్షల రుణ మాఫి, సాగు నీటి కాల్వల అభివృద్ధి, రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇండ్లు, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యం, పంపిణి,మహిళలకు ఉచిత బస్సు పథకాలు ప్రవేశ పెట్టి అమలుచేస్తుందని అన్నారు. పరిగి నియోజక వర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంత మొగులయ్య,సినియర్ నాయకులు మురళీకృష్ణ,ఫిల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య,అనంతయ్య, వెంకటయ్య విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించిన సర్పంచ్

తలకొండపల్లి, జనవరి18,ప్రభాత వార్త: తలకొండ పల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోని తిక్కల వెంకటయ్య గత 3 రోజుల క్రితం హార్ట్ స్ట్రోక్ తో కల్వకుర్తి సత్యనారాయణ హాస్పిటల్లో జాయిన్ అవ్వడం జరిగింది. అయితే వారు హైదరాబాద్ ప్రాగ్మా హాస్పిటల్‌లో సర్జరీ చేయాలని పంపగా నిన్న తిక్కల వెంకటయ్యకి సర్జరీ కావడం జరిగింది. ఈ విషయం రాంపూర్ గ్రామ సర్పంచి వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ తెలుసుకొని గ్రామ నాయకులతో కలిసి వారిని హాస్పిటల్లో పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి త్వరగా కోలుకునే విధంగా డాక్టర్స్‌ని అడిగి తెలుసుకోవడం జరిగింది మరియు వారి సొంతంగా ఆర్థిక అవసరాల కోసం 5000/ రూపాయలు తక్షణ సాయం చేయడం జరిగింది. మరియు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్న నేను ముందుండి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తానని వారి కుటుంబ సభ్యులు తిక్కల యాదమ్మ, మహేష్, శివకి హామీ ఇవ్వడం జరిగింది...

ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దీ యాదయ్య , నాయకులు మొక్తాల రాఘవేందర్ గౌడ్ , మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు , యువ నాయకులు సప్పిడి పాండు , రొయ్యల మహేష్ గారు, హరికృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్లో పరామర్శిస్తున్న సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్